తెలంగాణ రైజింగ్ 2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలి

- సిఎస్ రామకృష్ణారావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైజింగ్ విజన్ -2047 పౌర సర్వేలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా పాల్గొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంటును రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న విజన్ తయారీలో పౌరులందరూ భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టామని తెలిపారు. అక్టోబర్ 10న ప్రారంభమైన సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో ప్రతి ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ నెల 25 వరకు జరిగే సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనడంతోపాటు సర్వే లింక్ కోడ్‌ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సర్క్యులర్‌లో ఆదేశించారు.

జిఒ 9కు పూర్తి మద్దతు

- బిసిల పట్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీలది ద్వంద్వ వైఖరి
- కేంద్రంపై ఒత్తిడి పెంచాలి : ప్రొ. కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 9కు తెలంగాణ జన సమితి పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని టిజెఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశమై పలు తీర్మానాలను ఆమోదించింది. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ బిసిల పట్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. బిసిల రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లుకు మద్దతిస్తూనే రిజర్వేషన్ వ్యతిరేకులకు ఊతమిస్తున్నాయని ఆయన ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కార్యాచరణ చేపట్టేందుకు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్ రావు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 18న బిసి జెఎసి తలపెట్టిన బంద్‌కు మద్దతు తెలిపారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం బిల్లును షెడ్యూల్ 9లో చేర్చాలని, ఇందు కోసం కేంద్రం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నరసయ్య మాట్లాడుతూ ఈనెల 15న మండల స్థాయిలో ప్రెస్‌మీట్ పెట్టి బంద్‌కు మద్దతు పలకాలని, 16న ఎమ్మార్వోలకు వినతి పత్రాలు, 17న జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈనెల 16న కోదండరాం నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో టిజెఎస్ నాయకులు గోపగాని శంకర్రావు, పల్లె వినయ్ కుమార్, రమేష్ ముదిరాజ్, ఆర్.లక్ష్మి, జస్వంత్ కుమార్, బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతివ్వండి : బిసి జెఎసి నేతలు

18న తలపెట్టిన బంద్‌కు మద్దతివ్వాలని బిసి సంఘాల జెఏసి చైర్మన్ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బిసి మేధావి నారగోని తదితరులు కోరారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం వారు టిజెఎస్ అధ్యక్షులు ప్రొ. కోదండరాం తదితరులను కలిశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ బిసి సంఘాలు చేసే అన్ని పోరాటాలకు తమ పార్టీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



ఎఫ్ఐపి ఓపెన్ పాడెల్ టోర్నమెంట్‌లో స్పెయిన్ హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరంలో జరిగిన ఎఫ్ఐపి సిల్వర్ రాధా టిఎంటి ఇండియన్ ఓపెన్ పాడెల్ టోర్నమెంట్‌లో మహిళల, పురుషుల విభాగాల్లో స్పెయిన్ క్రీడాకారులు టైటిల్స్ గెలిచి సత్తా చాటారు. మహిళల విభాగంలో లూసియా మాన్కిలో అలార్జా, లూసియా లుజాన్ రోడ్రిగ్జ్ జోడీ, పురుషుల విభాగంలో జి ఫిగెరోలా శాంటియాగో, ఆర్.బెల్మాంట్ పాస్టర్ ద్వయం విజేతలుగా నిలిచారు. విజేతలకు రాష్ట్ర ఐటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పతకాలను అందించారు.

వంద శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు

- పంపిణీ కార్యక్రమ ప్రారంభోత్సవంతో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు వంద శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ సీడ్స్ (ఎన్ఎంఈవో-ఓఎస్) స్కీమ్ కింద 2025-26గానూ వేరుశనగ సబ్సిడీ విత్తనాల సరఫరా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. జాతీయ నూనె గింజల పథకాన్ని రూ.66.67 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈ యాసంగి సీజన్‌లో 45,350 ఎకరాల్లో 38434 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో రూ.46.14 కోట్లతో మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, అమన్‌గల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ యాట గీత, రంగారెడ్డి జిల్లా కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి సబ్సిడీ వేరుశనగా విత్తనాలు పంపిణీ చేశారు.

బాటా 'బ్రైటర్ మూమెంట్స్' కలెక్షన్స్ విడుదల



హైదరాబాద్ :ప్రముఖ పాదరక్షల ఉత్పత్తుల కంపెనీ బాటా ఇండియా కొత్తగా తన "బ్రైటర్ మూమెంట్స్" కలెక్షన్ విడుదల చేసింది. హైదరాబాద్‌లోని శరత్ సిటీ క్యాపిటల్‌లో వీటిని హీరోయిన్ నిహారిక ఎన్ఎమ్ ఆవిష్కరించారు.

తెలంగాణలోకి అపోలో ఆయుర్వేద్

- హైదరాబాద్‌లో ఇంటిగ్రేటివ్ మెడిసిన్ కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్ : ఖచ్చితత్వం, సమగ్రతతో కూడిన ఆయుర్వేద చికిత్స అందించేందుకు అపోలో అయుర్వేద్ హాస్పిటల్స్ తెలంగాణలోకి ప్రవేశించింది. హెచ్‌సిఎహెచ్ సువిటాస్తో భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని సోమాజిగూడలో తమ తొలి అయుర్వేద్ హెచ్‌సిఎహెచ్ సెంటర్ ఫర్ ప్రెసిషన్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్"ను ప్రారంభించినట్లు ఆ సంస్థ మంగళవారం ప్రకటించింది. ఈ కేంద్రం ముఖ్యంగా ఇంటిగ్రేటివ్ న్యూరో రిహాబిలిటేటివ్ కేర్‌లో నిపుణత చూపిస్తుంది. సంక్లిష్ట, దీర్ఘకాలిక, క్షీణించిన అనారోగ్యాలతో బాధపడే రోగులకు సమగ్ర రీహాబిలిటేషన్, రికవరీ సేవలు అందిస్తుందని అపోలో ఆయుర్వేద్ హాస్పిటల్స్ ఫౌండర్, ఎండి రాజీవ్ వాసుదేవన్ తెలిపారు.

బిసి రిజర్వేషన్లపై 17న సిపిఎం 'చలో రాజ్‌భవన్'

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకోవడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం వెంటనే 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లును ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న చలో గవర్నర్ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు, బిసి వర్గాలకు, సామాజిక శక్తులు, సంస్థలు, వ్యక్తులను కోరింది.రాష్ట్ర శాసనసభలో బిసి రిజర్వేషన్ల బిల్లును బిజెపి ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటున్నది. ఆ పార్టీ నాయకులు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలేదు.

106 మంది ఇరిగేషన్ ఇంజనీర్లపై బదిలీ వేటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటిపారుదల శాఖలో ఇంజనీర్లను భారీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు మంగళవారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌డిఎస్ఏ జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. బదిలీ అయిన 106 మంది ఇంజనీర్లల్లో ఇఇలు, డిఇఇలు, ఎఇఇలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజనీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం.

బిసి రిజర్వేషన్లకు అడ్డు బిజెపి

- 18న రాష్ట్ర బంద్‌కు స్పష్టమైన డిమాండ్ పెట్టాలి
- కేంద్రంపై పోరాడతామంటేనే మద్దతు
- లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తాం : జాన్‌వెస్లీ
- బిసిలకు న్యాయమైన వాటా కోసమే పోరాటం : ఆర్ కృష్ణయ్య
- కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి : జాజుల



కార్యక్రమంలో జాన్‌వెస్లీ, ఆర్ కృష్ణయ్య, జాజుల తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్నది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. బిసి జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్రబంద్‌కు స్పష్టమైన డిమాండ్ పెట్టాల్సిన అవసరముందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని, బిజెపి తీరును నిరసిస్తూ బంద్ చేపడితేనే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కేంద్రంపై పోరాటం చేయకుండా బంద్ చేపడితే బిసిల రిజర్వేషన్ల అమలు కోసం తాము స్వతంత్రంగానే పోరాటాలను కొనసాగిస్తామని వివరించారు. బిసి రిజర్వేషన్ల కోసం బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌కు బిసి జెఎసి నేతలు వచ్చారు. జాన్‌వెస్లీ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, బండారు రవికుమార్‌లతో జెఏసి చైర్మెన్ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మెన్ నారగోని, కో చైర్మెన్ రాజారాంయాదవ్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరగాలని అన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. ఆర్డినెన్స్‌ను ఆమోదించలేదని చెప్పారు. బిసి రిజర్వేషన్లకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుగా ఉందన్నారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చితే ఈ సమస్య ఉండబోదని స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల కోసం కేంద్రంపైనే పోరాడాలని పిలుపునిచ్చారు. అప్పుడే అమలవుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన ప్రయత్నాలకే పరిమితం కాకుండా అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు పోరాటం చేయాలన్నారు. రాష్ట్రబంద్ ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నదో స్పష్టత ఉండాలని అన్నారు. బిజెపి కూడా ఈ బంద్‌కు మద్దతు ఇస్తే ఎవరికి వ్యతిరేకంగా పోరాటం జరుగుతుందని ప్రశ్నించారు. కేంద్రంపై పోరాడాలనే స్పష్టత ఉంటేనే బంద్‌కు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. లేదంటే స్వతంత్రంగా పోరాటాలు చేస్తామన్నారు. బిసిల రిజర్వేషన్లకు, సామాజిక న్యాయానికి సిపిఎం కట్టుబడి ఉందని చెప్పారు. ఎస్ వీరయ్య మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకోకూడదని అమలయ్యేవిధంగా చూడాలన్నారు. ఇందులో ఎవరికీ సందేహం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడేది బిజెపియేనని విమర్శించారు. ప్రజలకు స్పష్టత ఇవ్వాలని చెప్పారు. బిజెపి ఎంపిగా ఉన్న ఆర్ కృష్ణయ్య సహా అందరం కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంతో పోరాడతామంటేనే బంద్‌కు మద్దతివ్వడానికి తమకు అభ్యంతరం లేదన్నారు.

ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇచ్చిన జిఒ నెంబర్ తొమ్మిది చట్టబద్ధం, రాజ్యాంగబద్ధమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. బిసిల నోటికాడి ముద్దను లాక్కుంటారని అన్నారు. బిసిల వాదనను కోర్టు వినలేదని చెప్పారు. న్యాయమైన వాటా దక్కడం కోసమే ఉద్యమం చేపట్టామని వివరించారు. ఈనెల 18న బంద్‌లో బిసిల బలం చూపెట్టాలని అన్నారు. సిపిఎం పేదల పక్షాన నిలబడుతుందని, బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అడగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. బిసి రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే జనాభా దామాషా ప్రకారం బిసిల రిజర్వేషన్లను రాజ్యాంగంలో చేర్చాలని సూచించారు. బిజెపి ముఖ్యమా?, బిసిలు ముఖ్యమా?అని అంటే బిసిలే ముఖ్యమంటూ ఆర్ కృష్ణయ్య ముందుకొచ్చారని చెప్పారు. నారగోని మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌ను ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని అన్నారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్లకు ఉన్నట్టుగానే బిసి రిజర్వేషన్‌కు రాజ్యాంగంలో చట్టబద్ధత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, పి ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, బిసి జెఎసి నేతలు తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లపై 17న చలో రాజ్‌భవన్ : సిపిఎం

రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం వెంటనే 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో చట్టాన్ని తేవాలని, తొమ్మిదో షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఈ నెల 17న చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు, బిసి వర్గాలు, సామాజిక శక్తులు, సంస్థలు, వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ల బిల్లును బిజెపి ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటోందని విమర్శించారు. ఆపార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పోరాడుతూనే, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్రంపై పోరాడితేనే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కళ్ల ముందు కనిపిస్తున్న వర్గీకరణ ఫలితాలు

- ఎస్‌సి వర్గీకరణతో సామాజిక న్యాయం
- అన్ని వర్గాలకు సముచితంగా విద్యావకాశాలు : మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎస్‌సి వర్గీకరణ ఫలితాలు కండ్ల ముందు కనిపిస్తున్నాయని, సామాజిక న్యాయం దక్కుతున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అన్ని వర్గాలకు సముచితంగా విద్యావకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సుల్లో ఆయా వర్గాల విద్యార్థులకు వచ్చిన సీట్లు, ఇతర అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి, డ్రాప్ అవుట్స్ అవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫాకల్టీ, సీనియర్లతో మెంటార్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎస్‌సిల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలకు కూడా ఈ ఏడాది మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో సముచిత సంఖ్యలో సీట్లు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణతోనే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం తదితర అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎంబిబిఎస్‌లో ఎస్‌సి గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 41 సీట్లు, ఎస్‌సి గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 561 సీట్లు, ఎస్‌సి గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 324 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ఎస్‌సి గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 378 సీట్లు, ఎస్‌సి గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 8,246 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 5,466 సీట్లు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఫార్మసీలో ఎస్‌సి గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 60 సీట్లు, ఎస్‌సి గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 1,603 సీట్లు, ఎస్‌సి గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 898 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఇన్నాళ్లు గుర్తింపునకు నోచుకోని వర్గాల పిల్లలకు కూడా వర్గీకరణ అమలుతో ఉన్నత విద్యావకాశాలు రావడం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు. దశాబ్దాల వర్గీకరణ కలను నెరవేరి, మొదటి ఏడాదిలోనే ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. వర్గీకరణ సామాజిక న్యాయం సాధించడానికే తప్ప ఏ కులానికి వ్యతిరేకం కాదని తాము మొదట్నుంచి చెబుతున్న విషయం నిరూపితమైందని తెలిపారు. అత్యంత వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులు, ఇంగ్లీష్ భాష రాకపోవడం వంటి సమస్యలతో ఆత్మన్యూనత భావానికి లోనయ్యే ప్రమాదం ఉందనీ, ఇది డ్రాప్ అవుట్స్‌కు దారి తీస్తుందని మంత్రి హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయా విద్యార్థులు ఆత్మన్యూనతకు లోనవకుండా చూసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక తరగతుల నిర్వాహించాలనీ, సైకాలజిస్టులతో మోటివేషన్ క్లాసులు చెప్పించాలని సూచించారు. విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి టీచింగ్ ఫాకల్టీని, సీనియర్ స్టూడెంట్లను మెంటార్లుగా నియమించాలని సూచించారు. అకాడమిక్స్‌తో పాటు లాంగ్వేజ్, ఇతరత్ర అవసరమైన స్కిల్స్ నేర్పించేందుకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు.

ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ విసి కుమార్, జెఎన్‌టియు విసి కిషన్ కుమార్ రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విసి ఘంట చక్రపాణి పాల్గొన్నారు.

బాధిత నర్సింగ్ విద్యార్థులను ఆదుకోండి

- మంత్రి దామోదరకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైటింగేల్ నర్సింగ్ స్కూల్ చేత మోసపోయిన బాధిత జిఎన్ఎం విద్యార్థులను ఆదుకోవాలని సామాజిక కార్యకర్త అడ్వొకేట్ డాక్టర్ లుబ్నా సార్వత్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధిత విద్యార్థినీలతో పాటు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. నైటింగేల్ బారి నుంచి వారిని తప్పించి ఆరు ప్రభుత్వ నర్సింగ్ స్కూళ్లలో వారు చదువుకుంటున్నట్టు ఆమె తెలిపారు. అయితే ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులను ఆ విద్యార్థులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి కుటుంబాల్లో మొదటి జనరేషన్ గ్రాడ్యుయేట్స్‌గా మారే క్రమంలో వారికి కావాల్సిన సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చినట్టు లుబ్నా సార్వత్ వెల్లడించారు.

దళితులకు రక్షణ కల్పించండి

- ప్రధాని మోడీకి ఎంపి మల్లు రవి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయనీ, వారికి రక్షణ కల్పించాలని ఎంపి మల్లు రవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి ఆయన లేఖ రాశారు. ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన ఐపీఎస్ అధికారి విషాదకరమైన ఆత్మహత్య చేసుకోవడం, సుప్రీంకోర్టు ఓపెన్ హాల్‌లో ఎస్సీ వర్గానికి చెందిన భారత ప్రధాన న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని షూతో దాడి చేయడమనేది ఎంతో ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. ఐపిఎస్ అధికారి ఆత్మహత్యకు మరియు సిజెఐ సంఘటనకు కారణమైన బాధ్యతాయుతమైన అధికారులపై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసులలో దళితులు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సవాళ్లను గుర్తించేందుకు, సమస్యను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దళితుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు జాతీయ స్థాయిలో ప్రభుత్వం చొరవ ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. దళిత వర్గాలను రక్షించాలనీ, వారికి విశ్వాసం కల్పించాలని కోరారు.

18న గ్రూప్-2 అభ్యర్థులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె రామకృష్ణారావు వెల్లడించారు. 18న సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందిస్తారని తెలిపారు. వారిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులున్నారనీ. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితోపాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం నాలుగు గంటలలోపు శిల్పకళా వేదికలోకి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నారని వివరించారు. దీంతో రెవెన్యూ, హోం, జీఏడీ కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 ఏళ్లపాటు సర్వీస్‌లో ఉంటారనీ, వారికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలనీ, అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వీ, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టికె శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టిజిపిఎస్‌సి విడుదల చేసిన విషయం తెలిసిందే.

దేవాదుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ బ్యూరో : జె.చొక్కారావు దేవాదుల ప్రాజెక్ పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తద్వారా ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా గంగారాం గ్రామ సమీపంలోని గోదావరి నది నుండి 38.16 టి.ఎం.సిల నీటిని వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భుపాలపల్లి, ములుగు, జనగామ, భోనగిరి యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని ఆయన వివరించారు. 71 మీటర్ల ఎత్తు నుండి 540 మీటర్ల ఎత్తు వరకు మొత్తం 469 మీటర్ల మేర ఎత్తిపోతల పథకం ఇదని ఆయన తెలిపారు.

సామ్‌సంగ్ రికార్డ్ అమ్మకాలు

గుర్‌గావ్ : ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల బ్రాండ్ సామ్‌సంగ్ ఇటీవల నవరాత్రుల కాలంలో రికార్డ్ అమ్మకాలను నమోదు చేసినట్లు తెలిపింది. స్మార్ట్‌ఫోన్‌లు, ప్రీమియం టెలివిజన్‌లు, గృహోపకరణాల విక్రయాలు పెరిగాయని పేర్కొంది. తమ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు 40 శాతం, టివి విక్రయాలు 100 శాతం పెరిగాయని తెలిపింది. ఎసి సహా గృహోపకరణాల అమ్మకాలు 30 శాతం వృద్ధి చెందాయని పేర్కొంది.

పిల్లల కోసం ఐటిసి వినూత్న వేదిక ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల కంపెనీ ఐటిసి తన ఐటిసి కాండిమాన్ బ్రాండ్ పిల్లల కోసం వినూత్నమైన 'వన్స్ అపాన్ ఎ టైం బై కాండీమాన్' ప్లాట్‌ఫాంను ప్రారంభించింది. ఇది తల్లిదండ్రులు తమ పిల్లల పేరు, ఫోటోతో వ్యక్తిగతీకరించిన కథల పుస్తకాలు సృష్టించే అవకాశాన్ని ఇస్తుందని ఐటిసి ఫుడ్స్ డివిజన్ హెడ్ అనుజ్ బన్సల్ పేర్కొన్నారు. పిల్లలను కథానాయకులుగా మార్చడంతో పాటు వారి ఊహాశక్తిని పెంపొందిస్తోందన్నారు.

ప్రతి విద్యార్థి స్కూల్లోనే ఉండాలి

- బెస్ట్ అవలేబుల్ స్కూళ్లపై వెంటనే నివేదిక పంపండి
- కలెక్టర్లకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెస్ట్ అవలేబుల్ స్కూళ్లపై వెంటనే నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బకాయిల పేరిట బెస్ట్ అవలేబుల్ స్కూళ్ల కు విద్యార్థులను అనుమతించక పోవడంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్య జరిగింది. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలే తప్ప విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదు. జిల్లా కలెక్టర్లు, డిఇఒలు, సంక్షేమ శాఖ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని ఈ స్కీం కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టండి" అని భట్టి ఆదేశించారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీం ఏం చెబుతుందో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని ఆదేశించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని అన్నారు. "బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని యాజమాన్యాలు అంటున్నాయి.

ఈ స్కీం నిధులపై ఆధారపడితే అది ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుంది. డిఇఒలు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను సందర్శించాలి. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత? ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? తదితర వివరాలతో వెంటనే నివేదిక సమర్పించండి" అని భట్టి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్, కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.



సిఐటియులోకి చేరుతున్న రైస్‌మిల్ బార్దాన్ కార్మికులు

సిఐటియులో చేరికలు
300 మంది రైస్‌మిల్ బార్దాన్ కార్మికులు

- కూలి రేట్లు పెంచాలని అసోసియేషన్‌కు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లాలో 32 రైస్ మిల్లులకు చెందిన 300 మంది బార్దాన్ కార్మికులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా నూర్జహాన్ కార్మికులకు స్వాగతం పలికారు. ప్రభుత్వాలు అనుసరించే విధానాలతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, భద్రత, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తమ హక్కుల సాధనకు రైస్‌మిల్ బార్దన్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కూలి రేట్ల పెంపు కోసం రైస్‌మిల్ అసోసియేషన్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్ బార్దాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి ఇమామ్, నాయకులు విజయ్, ఎస్‌కె అబ్దుల్, కేధరమ్మ భాస్కర్, రైస్‌మిల్ ముఖద్దం నాయకులు అజయ్, మనోజ్, శోభాభాయ్, గుడ్డు లాల్ సింగ్, బి ప్రసాద్, రింక్ బోటి, లాల్‌సింగ్, విజయ్, గులాబ్ చంద్ రింకు, కార్మికులు రేఖ, సునీత, విజయ్, రాజు పాల్గొన్నారు.

మూడు నెలలు నెగిటివ్ ద్రవ్యోల్బణం

- పాలన వైఫల్యానికి నిదర్శనం : హరీశ్ రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే దిశగా పయనిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలు నెగిటివ్ ద్రవ్యోల్బణం పాలన వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. అనాలోచిత విధానాలతో ఆర్థిక నిర్వహణలో రేవంత్ సర్కారు విఫలమయిందని విమర్శించారు. రాష్ట్రం తిరోగమనం వైపు పయనిస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54శాతంగా నమోదైతే, తెలంగాణలో నెగిటివ్ ద్రవ్యోల్బణం నమోదవుతుండటం మందగించిన ఆర్థిక పతనానికి సంకేతమని చెప్పారు. జూన్ లో -0.93 శాతం, జూలైలో 0.44 శాతం, సెప్టెంబర్‌లో 0.15 శాతంతో వరుసగా నాలుగు నెలల్లో మూడు నెలలు డిఫ్లేషన్ నమోదు కావడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రుణాత్మక ద్రవ్యోల్బణం మూడు సార్లు నమోదు కావడం ఇదే మొదటి సారి అని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సాధారణంగా వినియోగం పెరిగి, పాజిటివ్ ద్రవ్యోల్బణం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందనీ, కానీ, నెగిటివ్ ద్రవ్యోల్బణం నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక విధానాల వైఫల్యమని తెలిపారు. కెసిఆర్ పాలనలో అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలన, ఆర్థిక అరాచకత్వం వల్ల రాష్ట్రం ఆర్థిక తిరోగమనం వైపు పయనిస్తున్నదని మండి పడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుల్డోజర్ విధానాలు, ప్రతీకార రాజకీయాలు మానుకొని నానాటికి చతికిల పడిపోతున్న రాష్ట్ర ఆర్థిక వృద్ధి మీద దృష్టి సారించాలని సూచించారు.


కాంగ్రెస్ పాలనలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

- ఎఐసిసి రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎఐసిసి రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఉప ఎన్నిక సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగల్‌రావు నగర్, యూసుఫ్‌గూడ కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశం మంగళవారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రతి ఓటర్‌కూ చేరవేయాలన్నారు. కలిసికట్టుగా కష్టపడితే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ గూబ గుయ్యిమనేట్టు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని తెలిపారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ గులాబీ పార్టీ ఓట్ల కోసం ఆరాటపడుతున్నదని విమర్శించారు.



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సునీతపై తమకు సానుభూతి ఉంది కానీ కెటిఆర్, హరీశ్ వారి రాజకీయాల కోసం ఆమెను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. దొంగ ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదని, బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ ఓట్ల నమోదుకు బిఆర్ఎస్, బిజెపిదే బాధ్యత అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, సీతక్క, ఎంపి, సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు అనిల్‌కుమార్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్‌లు విజయారెడ్డి, సిఎన్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేన, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, సీనియర్ నాయకులు అజారుద్దీన్, మురళిగౌడ్, సంజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నేతను చంపిన మావోయిస్టులు

- బీజాపూర్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎలిమిడి పోలీస్ స్టేషన్ పరిధి దండకారణ్య ప్రాంతం ముంజల్ కంకేర్ నివాసి, బిజెపి నాయకులు సత్యం పూనెంను మావోయిస్టులు సోమవారం రాత్రి హత్య చేశారు. సమాచారం అందుకున్న బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ దర్యాప్తు ముమ్మరం చేశారు. బీజాపూర్ జిల్లాలోని ఇల్మిడి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగినట్టు సమాచారం. సత్యం పూనెంకు బీజాపూర్ జిల్లా మాజీ మంత్రి మహేష్ గగ్డా నివాళులు అర్పించారు. ఆయన మృతి బిజెపికి తీరని నష్టం అని అన్నారు. ఈ ప్రాంతంలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేయడం చాలా విచారకరమని ఫేస్‌బుక్ వేదికగా తెలియజేశారు. కాగా, పూనెం మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీకి చెందిన మద్దేడ్ ఏరియా కమిటీ ఒక కరపత్రం వదిలేసింది. సత్యం పూనెం పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని, మూడుసార్లు హెచ్చరించామని పేర్కొంది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీన పరుచుకున్నారు.

ఇద్దరు కవల పిల్లల్ని చంపి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాలలో తీవ్ర విషాదం నెలకొంది. పిల్లల ఆరోగ్యం విషయంలో భర్తతో గొడవ కారణంగా ఓ మహిళ తన ఇద్దరు కవల పిల్లలను హత్య చేసి.. ఆపై ఆమె కూడా ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ నరసింహారాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎపికి చెందిన సాయిలక్ష్మి (27), అనిల్ కుమార్ దంపతులు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 1లో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కవల పిల్లలు కార్తికేయ, లాస్య వల్లి (2) ఉన్నారు. కార్తికేయకు రెండేళ్లు వచ్చినా మాటలు రాకపోవడంతో కొద్దిరోజులుగా దంపతుల మధ్య గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో సాయిలక్ష్మి మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కవల పిల్లలిద్దరినీ గొంతు నులిమి చంపింది. అనంతరం ఆమె ఇంటి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓట్ల చోరీ

- హైకోర్టుకు వెళతాం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్ల చోరీకి పాల్పడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆ పార్టీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కే విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఒక్కసారిగా 23 వేల ఓట్లు పెరిగాయయని, 12 వేల ఓట్లు తొలగించబడ్డాయని చెప్పారు. అసాధారణ పెరుగుదల, తొలగింపులపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల కమిషన్ డ్యూటీని తన చేతుల్లోకి తీసుకుని అక్రమంగా ఓటు ఐడీలను పంపిణీ చేశారని, మైనర్ బాల, బాలికలకు కూడా పంచారని దుయ్యపట్టారు. ఈ ఫేక్ ఐడీల పంపిణీపై ఎన్నికల సంఘం కేసు నమోదు చేసిన నేపథ్యంలో తమ పార్టీ కార్యకర్తలు, శ్రేణులు మొత్తం వ్యవహారాన్ని పరిశీలించినట్టు చెప్పారు. "43 ఓట్లు ఉన్న సాంస్కృతి అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లి చూశాము. "ఇక్కడ ఉన్న వారికి, ఇంటి యజమానులకు, ఈ లిస్టులో ఉన్న వాళ్లకి ఎలాంటి సంబంధం లేదు" అని చెప్పారు. బూత్ నంబర్ 125లో ఒక ఇంట్లో 23 ఓట్లు ఉన్నాయి. 80 గజాలు మాత్రం ఉన్న ఇంట్లో అంత మంది ఎందుకు వచ్చారో మాకు తెలవదని యజమాని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లీడర్‌కు సంబంధించిన ఇంట్లో 32 దొంగ ఓట్లు ఉన్నాయి. ఇక్కడ ఉన్న వ్యక్తులకు ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్నాయి. ఇలా దొంగ ఓట్లు, రెండు మూడు ఓటర్ ఐడీ కార్డులు, ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న వారి వివరాలను ఎన్నికల సంఘానికి ఇప్పటికే అందించాం. జూబ్లీహిల్స్‌లో ఓటుగా నమోదైన సిరిసిల్ల నివాసి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడితే తనకు సంబంధం లేకుండానే తన ఓటును జూబ్లీహిల్స్‌లో నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. ఒక్కొక్క వ్యక్తికి రెండు మూడు ఎపిక్ కార్డులు ఉన్నాయి. ఓట్లన్నిటిని కూడా ఎన్నికల షెడ్యూల్ కింద రాయించారు. 42 ఓట్లు ఉన్నాయని ఓటర్ లిస్టులో పేర్కొన్న ఇంటి నెంబర్‌తో వెతికితే అసలు ఆ ఇల్లే లేదు. ఇవన్నీ కూడా ఒకటే రోజు ఓటర్ల జాబితాలో కాంగ్రెస్ ప్రభుత్వం నింపింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ సొంత తమ్ముడు వెంకట్ ప్రవీణ్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికి మూడు ఓట్లు ఉన్నాక స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతాయని అని తాము ఎలా అనుకోవాలి..." అని కెటిఆర్ ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ ఓట్ల చోరీ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌ను కలిసి పార్టీ తరపున లేఖ కూడా ఇచ్చి 24 గంటలు దాటినా స్పందన లేదని కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన 23 వేల ఓట్ల పైన సంపూర్ణ దర్యాప్తు జరపాలనీ, డూప్లికేట్, నకిలీ ఓట్లను వెంటనే డిలీట్ చేయాలనీ, ఈ ఓట్ల నమోదుకు, అక్రమాలకు పాల్పడిన అధికారులందరి పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని ఆయన కోరారు. తాము లేవనెత్తిన ప్రతి అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకొని దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేవలం రెండు రోజుల్లోనే తమ పార్టీ కార్యకర్తలు అనేక అక్రమాలను గుర్తించగలిగినప్పుడు ప్రభుత్వ అధికార యంత్రాంగం మొత్తం కలిగిన ఎన్నికల కమిషన్ ఎందుకు అక్రమాలను గుర్తించి తొలగించలేకపోతున్నది? అని ఆయన ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి రోహిత్

ఎస్‌పి ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

- తక్షణ సహాయం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ అధికారులు చేపడుతున్న ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆరుగురు మావోయిస్టు పార్టీ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిశారని జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం జనవరి-2025 నుంచి ఇప్పటివరకు వీరితో కలిపి 326 మంది మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన ఆరుగురిలో కునజం పాపారావు అలిమాస్ దినేష్, లక్మా బండి అలియాస్ శాంతి, మడివి కోస, పద్దం లక్మా అలియాస్ గుడ్డి, మడివి లక్మా, దొడ్డి బద్రు ఉన్నారన్నారు. వారికి తక్షణ సహాయంగా రూ.25 వేల చొప్పున మొత్తం రూ.1,50,000 ఇచ్చామని ఎస్‌పి తెలిపారు.

కాళ్లు కడగడం కాదు.. కార్మికులకు కూడు పెట్టు

- ప్రధాని మాటలు పేదలవి.. చేతలు పెట్టుబడిదారునివి
- కెసిఆర్ పాలనలో కార్మికులు నలిగిపోయారు : పాలడుగు భాస్కర్
- తుర్కయాంజల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభ ప్రారంభం
- స్త్రీలకు పని ప్రదేశంలో భద్రత కల్పించాలి : ఎస్ రమ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కార్మికుల కాళ్లు కడిగి, ఫొటోలకు పోజులు ఇస్తే సరిపోదు.. కార్మికుల కడుపు నింపాల్సిన బాధ్యత ప్రధాని నరేంద్రమోడీపై ఉంది' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మీడియా, సమాజం ముందు బహిరంగంగా సఫాయి కార్మికుల కాళ్లు కడిగి.. లోపలి గదిలో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు ఇచ్చే శానిటైజర్‌తో చేతులు కడుక్కోవడాన్ని సమాజం గమనిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల మొసలి కన్నీరు కార్చడం కాదని, దమ్ముంటే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 5వ మహాసభ రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపల్ పట్టణంలో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మన్నెగూడలోని నీలం సంజీవరెడ్డినగర్‌లో చలసాని వారి కళ్యాణ మండపం వద్ద యూనియన్ జిల్లా కార్యదర్శి కిషన్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు రాగన్నగూడ సిఐటియు కార్యాలయం నుంచి మహాసభ ప్రాంగణం వరకు వేలాది మంది కార్మికులతో భారీ ప్రదర్శన చేపట్టారు. 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి. సమస్యలు పరిష్కరించాలి. కనీస వేతనం అమలు చేయాలి' అని పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. బహిరంగ సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మికులను, కర్షకులను బానిసలుగా తయారు చేసే నిర్ణయాలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలతో కార్మిక చట్టాలను సాధించుకుంటే.. పెట్టుబడిదారుల కోసం మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తోందన్నారు. కార్మికుల దినసరి కూలీ రూ.278 సరిపోతాయా..? అంటే నెలకు రూ.ఐదు వేలు ఇస్తే బతకొచ్చని మోడీ చెబుతున్నారన్నారు. 'మోడీని, ఎంపీలను, ఎమ్మెల్యేలను అడుగుతున్న.. మీకు దమ్ముంటే మీరు చేసిన నిర్ణయాలపై నిలబడండి.. నెలకు రూ.5వేలతో బతకొచ్చు అంటున్నారుగా.. రోజుకు రూ.178 మీరు తీసుకుని మీ కుటుంబాన్ని సాకండి. అప్పుడు మేము ఒప్పుకుంటాం' అని భాస్కర్ సవాల్ విసిరారు. 'కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రజాప్రతినిధులు బతకడానికి లక్షల్లో వేతనాలు కావాలి.. పొద్దంతా మురికిలో మునిగిపోయి శ్రమిస్తే దినసరి కూలి రూ.278తో ఎలా బతకమంటారు..?' అని ప్రశ్నించారు.

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కెసిఆర్ కార్మికుల సమస్యలను ఖాతర్ చేయలేదు. కనీసం కార్మిక సంఘాలను గుర్తించలేదు.. రోడ్డెక్కితే అరెస్టులు, జైలు అని బెదిరింపులకు గురి చేశారు. ఈ నియంతను గద్దె దింపి.. ఇందిరమ్మ రాజ్యం అని తెచ్చుకుంటే.. .. కొత్త సీసాలో పాత సారాయి పోసిన చందంగా ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలను సిఎం గంగలో కలిపారని విమర్శించారు. 'సిఎం రేవంత్‌రెడ్డి కర్నాటక, మహారాష్ట్ర, జపాన్, జర్మన్ సుద్దులు చెప్పడం కాదు.. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న వేతనం రూ.21వేల గురించి పరిశీలించాలి' అని సూచించారు. 2వ పీఆర్‌సీకి సంబంధించిన ఫైల్ సిఎం దగ్గరే ఉందని, దాన్ని వెంటనే ఆమోదించాలని కోరారు. దాన్ని ఆమోదించే క్రమంలో లాస్ట్ బేస్డ్ స్కేలు కనీసం రూ.30వేలు ఉండేలా చూడాలన్నారు. కనీసం వేతనం అమలు చేయకపోతే కార్మికుల ఆగ్రహాన్ని చూడాల్సిన వస్తుందని హెచ్చరించారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి చెప్పుచేతుల్లో నడుస్తోందని విమర్శించారు. పేరుకు ప్రజాపాలన.. పాలనంతా పెత్తందారుల కోసమేనని అన్నారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాల్సిన ప్రభుత్వ పెద్దలు.. మహిళల వస్త్రధారణపై హేళన చేస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు ఈ సమాజాన్ని శుద్ధి చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వాలు మాత్రం ఆ కుటుంబాలను ఆదుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్మికులు తిరగబడితే ప్రభుత్వాలు కూలిపోయే చరిత్ర ఉందన్నారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నేతలు జనగాం రాజమల్లు, పాలడుగు సుధాకర్, సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎన్.రాజు, ఎం.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు డి.జగదీశ్, వై.స్వప్న, దేవేందర్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు, కోశాధికారి ఎల్లేష్, ప్యాట్రన్స్ టి.నర్సింహా, నాయకులు శేఖర్, చందునాయక్, యాదగిరి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట యువ రైతు ఆత్మహత్యాయత్నం

- లంచం అడిగారని రెవెన్యూ అధికారులపై ఆగ్రహం
- రైతును అడ్డుకుని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారని ఓ యువ రైతు తహశీల్దార్ కార్యాలయం ఎదుటే ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని దుండిగల్ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్లు 148, 150లో తన కుటుంబానికి కేటాయించిన భూదాన్ భూములకు సంబంధించి పట్టా, పాస్‌బుక్ కోసం రైతు సిద్ధు కొన్ని నెలలుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అలాగే, తన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాడు. అయితే, ఆ పని చేసేందుకు రెవెన్యూ అధికారులు రూ.ఆరు లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో మనస్తాపానికి గురైన రైతు కోర్టు తనకు అనుకూలంగా ఇచ్చిన ఆర్డర్ కాపీతోపాటు, చేతిలో ఒక లేఖ పట్టుకుని మంగళవారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. "రెవెన్యూ అధికారుల అవినీతి తీరుతోనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అక్కడ ఉన్న పోలీసులు, స్థానికులు అప్రమత్తమై అతన్ని అడ్డుకుని రక్షించారు. అనంతరం రైతును తహశీల్దార్ వద్దకు తీసుకెళ్లారు. బాధితుడికి ఎంఆర్ఓ ఎండి మతిన్ నచ్చజెప్పి భూమి పత్రాలు తీసుకుని రేపటిలోగా పని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, గిరిజనుడైన సిద్ధును అధికారులు కులం పేరుతో అవమానించారని, "మీ జాతి వాళ్లు ఆఫీసులోకి రాకూడదు" అని తిడుతూ అసభ్యకరంగా ప్రవర్తించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ అవమానం, లంచం డిమాండ్లతో విసిగిపోయిన సిద్ధు చివరికి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు చెప్పారు.

బస్సును ఢీకొట్టిన రెండు లారీలు

- బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రెండు లారీలు స్కూల్ బస్సును ముందు, వెనుక భాగం నుంచి ఒకేసారి ఢీకొట్టడంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మంగళవారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఆదిత్య పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకురావడానికి వెళ్తూ శెట్టిపాలెం క్రాస్ రోడ్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ వైపుకు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీ కొట్టింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ కూడా బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టింది. ఏకకాలంలో బస్సు వెనుక, ముందు భాగాలను లారీలు ఢీకొట్టడంతో డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసుల సహాయంతో బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.